సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 4 । ఆగస్టు । 2025



వెండి కిరీటం సమర్పణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం వేమవరం కొండలమ్మ వారికి పిల్లి శ్రీనివాసులు, సంధ్య, విహిత (కాకినాడ) రూ.1.40 లక్షల విలువైన వెండి కిరీటం సమర్పించారు.



గురుదేవా.. అందుకో పురస్కారం

వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లోని టీచర్లు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

8లో

కడలిలోకి 2.57 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,57,545 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 5 వేలు, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7 వేలు కలిపి మొత్తం 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం'

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఈ నెల 5న 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్‌వర్మ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్‌వర్మ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలకు మూలాలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలను వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని అన్నారు. ఇందులో భాగంగా ఉద్యోగుల సమస్యలపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ రూపొందించిన వీడియో, ఆడియో సందేశాలను ఉద్యోగులకు ప్రదర్శిస్తామన్నారు. ఆ సందేశాలపై ఉద్యోగులు టీ తాగుతూ చర్చించుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, అనపర్తి, కోరుకొండ, రాజమహేంద్రవరం రూరల్, ధవళేశ్వరం, గోపాలపురాల్లో ఈ నెల 5న ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్, సహాధ్యక్షుడు డీఎస్ చంబర్లీన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమివి కుట్రపూరిత రాజకీయాలు



విజయ సారథి

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలతో వైఎస్సార్ సీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తోందని ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ విజయ సారథి ఆరోపించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్రంలో పాలనపై దృష్టి సారించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా ఆ పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయాలనుకుంటోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, గంజాయి మత్తులో యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో క్రైస్తవులపై వివక్ష చూపుతున్నారన్నారు. క్రైస్తవ స్త్రీలని కూడా చూడకుండా ఇద్దరు నన్స్‌ను ఆధారం లేని కారణాలతో అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. క్రైస్తవులకు మేలు చేసే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. త్వరలోనే వైఎస్సార్ సీపీ సమన్వయకర్తల సహకారంతో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని విజయ సారథి వెల్లడించారు.

రాణి సుబ్బయ్య దీక్షితులు జీవితం ఆదర్శనీయం

కాకినాడ సిటీ: అష్టావధానులకు మార్గదర్శిగా, సాహితీ స్రష్టగా, సంస్కృత భాషాసాహిత్యాలకు విశేష సేవలందించిన రాణి సుబ్బయ్య దీక్షితులు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని మహాసహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. బాణుడు రచించిన కాదంబరి కావ్యంపై ఆయన సాహితీ ప్రసంగం చేశారు. రాణి సుబ్బయ్య దీక్షిత, సాహితీ కౌముది ఆధ్వర్యాన సూర్యకళా మందిరం ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. కాదంబరి కావ్యంలోని అనేక పాత్రల వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. కావ్యంలో పరిపాలన చేసే రాజు, నాయికానాయకులను వర్ణిస్తూ నేటి యువతకు ఆదర్శనీయంగా ఉండేలా ఆయన ప్రసంగం సాగింది.

గురువుల మధ్య.. కూటమి కుంపటి

- జెడ్పీ, ప్రభుత్వ టీచర్ల మధ్య గొడవలు పెడుతున్న సర్కారు
- ఎంఈఓ పోస్టుల భర్తీలో ప్రభుత్వ స్కూళ్ల హెచ్‌ఎంలకే ప్రాధాన్యం
- జెడ్పీ హెచ్‌ఎంలకు మొండిచేయి
- ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత



సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల మధ్య విభజన కుంపటి పెట్టింది. ఎంఈఓ పోస్టుల భర్తీని అడ్డం పెట్టుకుని గురువుల మధ్య తగాదాలు పెడుతోంది. మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య స్కూళ్లలోని ప్రధానోపాధ్యాయులను పక్కన పెట్టి, కేవలం రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న అతి తక్కువ స్కూళ్లలో పని చేస్తున్న హెచ్‌ఎంలు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓ-1గా నియమిస్తోంది. ఇందుకు సమ్మతి తెలపాలంటూ ప్రభుత్వ స్కూళ్ల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిణామం మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఉపాధ్యాయులకు ఆగ్రహం కలిగిస్తోంది. ప్రస్తుతం మండల విద్యా శాఖాధికారి-1(ఎంఈఓ-1)గా ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు పని చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులకే అవకాశం కల్పించడం దుర్మార్గమని మండిపడుతున్నారు. దీని వెనుక విభజించి.. పాలించు అనే విధానం దాగుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువుల మధ్య గొడవలు సృష్టించి లబ్ధి పొందే ప్రయత్నాల్లో భాగంగానే ప్రభుత్వం ఈ విధానం అవలంబిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

పదోన్నతులు వారికేనా.. మాకివ్వరా?

జిల్లావ్యాప్తంగా 203 జెడ్పీ, మున్సిపల్ హైస్కూళ్లలో 2,502 ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 11 ప్రభుత్వ పాఠశాలలుండగా.. వాటిలో కేవలం 173 మంది ఉపాధ్యాయులే ఉన్నారు. జెడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల మధ్య ఇంత భారీ వ్యత్యాసం ఉన్నా.. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 173 మంది టీచర్లకు మాత్రమే పదోన్నతులు దక్కేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై స్థానిక సంస్థల పాఠశాలల్లో పని చేస్తున్న పంచాయతీరాజ్ (పీఆర్) ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. పదోన్నతులు తమకెందుకివ్వరని ప్రశ్నిస్తున్నారు.

సీనియర్లను విస్మరించి..

మరోవైపు సీనియర్ ఉపాధ్యాయులను ప్రభుత్వం విస్మరిస్తోంది. వారిని ఎంఈఓ-2గా నియమించి సర్వీసులో జూనియర్లయిన ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓ-1గా ప్రాధాన్య పోస్టులు ఇవ్వడమేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. తద్వారా మెజారిటీ పీఆర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోంది. 90 శాతం ఉన్న పీఆర్ ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి అదే పోస్టులో ఉండిపోతున్నారు. దీనిపై వారు పోరాటాలు చేపట్టి, ప్రభుత్వం నుంచి సానుకూల ఉత్తర్వులు కూడా పొందారు. అయితే, ప్రభుత్వ ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించి ఈ ఉత్తర్వులకు బ్రేక్ వేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈఓ-1 పోస్టులు ఇవ్వవద్దని కోర్టు గత ఏడాది ఉత్తర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. దీనిపై స్టేటస్ కో అమలులో ఉంది. ప్రభుత్వ, పీఆర్ ఉపాధ్యాయులిద్దరికీ ప్రస్తుతానికి ఎంఈఓ-1 పోస్టులు ఇవ్వరాదంటూ ఉత్తర్వులున్నాయి. కానీ, ప్రస్తుతం ఎంఈఓ, ఉప విద్యా శాఖాధికారి (డీవైఈఓ) పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులకే కట్టబెడుతున్నారు. కోర్టు తీర్పు ప్రకారం స్టేటస్‌కో అమలు చేయాలి. 90 శాతంగా ఉన్న పీఆర్ ఉపాధ్యాయులను కూడా ఎంఈఓ-1, డీవైఈఓ వంటి ఉన్నత పోస్టుల్లో నియమించాలి. ఈ సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. జెడ్పీ, మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులందరూ జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) ద్వారా నియమితులైన వారే. సీనియారిటీ ప్రకారం ఎంఈఓ పోస్టులకు హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు అర్హులు. అయినప్పటికీ ప్రభుత్వం కామన్ రూల్స్ పాటించకుండా, కేవలం ప్రభుత్వ పాఠశాలల వారికే అవకాశం ఇవ్వడం ద్వారా తమపై వివక్ష చూపుతోందని ఇతర యాజమాన్య ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో అందరికీ అవకాశం

సర్వీస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎం/ఎంఈఓ పోస్టు ఫీడర్ కేడర్ పోస్టుగా ఉంది. అయితే, వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ లేవు. దీని వల్ల ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులకే ఎంఈఓ పోస్టులు ఇస్తున్నారు. వీటిని తమకూ ఇవ్వాలని జెడ్పీ టీచర్లు చాలాకాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో 2023లో వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంఈఓ-2 పోస్టులను సృష్టించి జెడ్పీ హెచ్‌ఎంలను నియమించింది. దీంతో వివాదం సద్దుమణిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంఈఓ-2 పోస్టులను రద్దు చేసేందుకు యత్నిస్తోంది. ఖాళీలను భర్తీ చేయడం లేదు. మరోవైపు ఎంఈఓ-1 పోస్టులను కేవలం ప్రభుత్వ యాజమాన్య హెచ్‌ఎం లేదా స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఇస్తోంది. గత ఏడాది చాలా మంది ఎంఈఓ-1లు రిటైరయ్యారు. ఆ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం పక్క మండలాల వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తోంది. ప్రభుత్వ చర్యలను అధిక సంఖ్యలో ఉన్న జెడ్పీ టీచర్లు వ్యతిరేకిస్తున్నారు.


ఉమ్మడి సర్వీస్ రూల్స్ పాటించాలి



ఉపాధ్యాయులందరూ డీఎస్సీ ద్వారానే నియమితులవుతారు. అలాంటప్పుడు ఉమ్మడి సర్వీస్ రూల్స్ పాటించాలి. అలా కాదని జెడ్పీ టీచర్లపై వివక్ష చూపడం తగదు. సర్వీస్ రూల్స్ కారణంగా రెండు దశాబ్దాలుగా జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు వివక్షకు గురవుతున్నారు. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ యాజమాన్యంలోని జూనియర్లు కూడా ఎంఈఓలు అవుతారు. సీనియర్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు పదోన్నతులు కోల్పోతారు. ఇది చాలా అన్యాయం.

– కోలా సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం, రాష్ట్ర సహాధ్యక్షుడు

సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలి



ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన మాత్రమే ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాలి. ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల వివరాలు మాత్రమే సేకరించడం తగదు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన జీఓ అమలు చేయాల్సి ఉన్నా.. పక్కన పెట్టడం తగదు.

– కేవీ రమణారావు, ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం, జిల్లా అధ్యక్షుడు

మళ్లీ ఆదిపత్య పోరు

- రూరల్, సిటీ ఎమ్మెల్యేల మధ్య కొనసాగుతున్న విభేదాలు
- మార్కెట్ కమిటీలో సిటీకి డైరెక్టర్ పదవి కేటాయించడం సంప్రదాయం
- దానికి తిలోదకాలిచ్చిన గోరంట్ల వర్గం
- ప్రమాణ స్వీకారానికి డుమ్మా కొట్టిన ఆదిరెడ్డి వర్గం

రాజమహేంద్రవరం రూరల్: వారిద్దరూ ఒకే పార్టీకి చెందిన నాయకులు. సందర్భం ఏదైనా ఒకే వేదికను పంచుకోవాల్సిన పరిస్థితి. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన వారు ఆధిపత్య పోరులో మునిగి తేలుతున్నారు. రాజమండ్రి సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తమ మధ్య విభేదాలను, ఆధిపత్య పోరును ఎప్పటికప్పుడు బయట పెట్టుకుంటూనే ఉన్నారు. టీడీపీ జిల్లా మినీ మహానాడులో స్వాగత ద్వారం ఫ్లెక్సీపై బుచ్చయ్య ఫొటో లేదంటూ ఆయన వర్గం గతంలో నానా హంగామా చేసింది. తాజాగా ఆదివారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా వీరి మధ్య ఉన్న అగాధం మరోసారి వెలుగులోకి వచ్చింది. మార్కెట్ కమిటీ పాలకవర్గంలో సిటీ నుంచి ఒక డైరెక్టర్ పదవిని కేటాయించడం సంప్రదాయంగా వస్తోంది. కానీ, ఈ కమిటీకి గౌరవాధ్యక్షుని హోదాలో ఉన్న గోరంట్ల ఆధ్వర్యంలో ఈ సంప్రదాయానికి తిలోదకాలిచ్చారు. కనీసం ఒక్క డైరెక్టర్‌ను కూడా సిటీకి కేటాయించలేదు. దీనిపై ఆదిరెడ్డి వర్గం అలక బూనింది. మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆదిరెడ్డితో పాటు ఆయన అనుచర వర్గం మొత్తం డుమ్మా కొట్టారు. దీంతో సిటీ, రూరల్ ఎమ్మెల్యేల మధ్య పొరపొచ్చాలు మరోసారి చర్చలోకి వచ్చాయి. సిటీ, రూరల్ నియోజకవర్గాలను రాజకీయంగా, భౌగోళికంగా విడదీసి చూడడం సాధ్యం కాదు. ఇటువంటి పరిస్థితుల్లో పరిపాలన, అభివృద్ధి, రాజకీయ అంశాల్లో ఇరు ప్రాంతాల నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం ఏ రాజకీయ పార్టీకైనా తప్పనిసరి. కానీ, అందుకు భిన్నంగా బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిలకడగా పొగాకు ధర

- కిలోకు గరిష్టంగా రూ.370
- 41.88 మిలియన్ కిలోల విక్రయాలు

దేవరపల్లి: మార్కెట్లో వర్జీనియా పొగాకు ధర వారం రోజులుగా నిలకడగా కొనసాగుతోంది. గత నెల 26 వరకూ కిలో గరిష్ట ధర రూ.390 ఉండగా, 27వ తేదీ నుంచి రూ.370కి తగ్గింది. వారం రోజులుగా అదే స్థాయిలో కొనసాగుతుంది. గరిష్ట ధర తగ్గినప్పటికీ సగటు ధర రూ.291.98 లభించడంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు. పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో శనివారం నాటికి సుమారు రూ.1,231 కోట్ల విలువైన 41.88 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. కిలోకు గరిష్టంగా రూ.370, కనిష్టంగా రూ.200, సగటున రూ.291.98 చొప్పున ధర లభించినట్టు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకూ 107 రోజులు వేలం నిర్వహించగా, 3,26,887 బేళ్ల విక్రయాలు జరిగాయి. ఐదు వేలం కేంద్రాలకూ ప్రతి రోజూ సుమారు 6 వేల బేళ్లు అమ్మకానికి వస్తున్నాయి. దేవరపల్లి వేలం కేంద్రంలో 7.10 మిలియన్ కిలోలు, జంగారెడ్డిగూడెం-1లో 9.31, జంగారెడ్డిగూడెం-2లో 8.91, కొయ్యలగూడెంలో 8.45, గోపాలపురంలో 8.10 మిలియన్ కిలోల చొప్పున పొగాకు విక్రయాలు జరిగాయని ప్రసాద్ వివరించారు. దేవరపల్లి వేలం కేంద్రంలో అత్యధికంగా కిలో సగటు ధర రూ.305 లభించింది. 2024-25 పంట కాలంలో సుమారు 80 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి జరిగిందన్నది అధికారుల అంచనా కాగా, ఇప్పటి వరకూ 50 శాతం పొగాకు కొనుగోళ్లు జరిగినట్లు ప్రసాద్ తెలిపారు.



దేవరపల్లి వేలం కేంద్రానికి అమ్మకానికి వచ్చిన బేళ్లు

అన్ని దారులూ వాడపల్లికే..

- భక్తులతో కిక్కిరిసిన వెంకన్న క్షేత్రం
- ఒక్క రోజే రూ.6.70 లక్షల ఆదాయం



అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం ఆదివారం భక్తజనంతో కిక్కిరిసింది. శనివారం ఇసుక వేస్తే రాలనంత రీతిలో భక్తులు తరలిరాగా ఆ జనంలో ప్రదక్షిణలు చేయలేని భక్తులు ఇతర వారాల్లో ఏదో ఒక రోజు నిర్ణయించుకుని ఏడు ప్రదక్షిణలు చేస్తున్నారు. 'ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్య ఫలం' నానుడితో అశేష భక్తజనం తరలి రావడంతో కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్రం నలుమూలల నుంచీ అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా, మిగిలిన ఆరు రోజులూ అత్యధికంగా వస్తున్నారు. దానితో ఈ క్షేత్రం శనివారాలే కాకుండా వారంలో మిగిలిన రోజుల్లో కూడా నిత్య కల్యాణం పచ్చతోరణంలా మారుతోంది. ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు ఆదివారం అష్టోత్తర పూజ, స్వామివారి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పండితుల ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యాన సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్క రోజే దేవస్థానానికి రూ.6,70,313 ఆదాయం వచ్చిందని చక్రధరరావు తెలిపారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో విశాఖపట్నం కళారాధన నృత్య కళాశాలకు చెందిన కళాకారిణులతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



వాడపల్లి ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న పండితుడు

నేటి నుంచి పవిత్రోత్సవాలు

వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు. సోమవారం ఉదయం రుత్విక్కులు దీక్షాధారణ, అకల్మష హోమం నిర్వహిస్తారు. సాయంత్రం అంకురార్పణ, పవిత్ర ప్రతిష్ఠ పూజలు చేయనున్నారు. ఐదో తేదీ ఉదయం అష్ట కలశ స్థాపన, మహాశాంతి హోమం, ఆరో తేదీ ఉదయం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి నిర్వహిస్తారని ఈఓ వివరించారు.

అద్భుతం.. అభినయ విన్యాసం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నర్తన రుషి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ శిష్యులచే నవజనార్దన పారిజాతం ఆలయ నృత్య ప్రదర్శన అద్భుతంగా జరిగింది. శ్రీ సద్గురు సన్నిధి నిర్వహణలో శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. తొలుత జి.రిషిక, శాన్విక, రూపాశ్రీలు వినాయక కౌతం, అన్నమయ్య కీర్తనలకు చూడముచ్చటగా నర్తించారు. ముగ్గురూ తొలి ప్రదర్శనలోనే ప్రేక్షకులను అలరించేలా నర్తించారు. గోదావరి తీరాన వెలసిన నవ జనార్దన స్వామి ఆలయంలో ప్రాచీన కాలంలో ఊపిరి పోసుకుని, ప్రపంచంలోనే అతి పెద్ద నాట్య ప్రక్రియగా ప్రసిద్ధి పొందిన నవజనార్దన పారిజాతం, భామాకలాపాన్ని అంకిత ఐశ్వర్య, ఆరుషి దుర్గాంబిక, భానుదుర్గ, నవ్యశ్రీ, నయనికలు చక్కగా ప్రదర్శించారు. ఈ ఐదుగురూ సత్యభామలనే తలపించారు. సత్యభామలోని ధీరత్వాన్ని, గర్వాన్ని, దుఃఖాన్ని ఇలా నవరసాలను అద్భుతంగా అభినయిస్తూ ఉత్తేజంగా నర్తించారు. సప్పా దుర్గాప్రసాద్ నవజనార్దన పారిజాత భామాకలాపంలో తన పాండిత్యాన్ని చూపించారు. ఈ అద్భుత అభినయాన్ని ప్రేక్షకులు తన్మయంతో తిలకించి కరతాళధ్వనులతో అభినందించారు. నర్తకిలను సద్గురు సన్నిధి వ్యవస్థాపకుడు శిష్ట్ల మధుసూదనరావు తదితర ప్రముఖులు సత్కరించారు. సప్పా దుర్గా ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు.



నృత్యం చేస్తున్న నర్తకీమణులు

ఇదేం ప్రవేశాలు

- డిగ్రీ అడ్మిషన్లపై గందరగోళం
- ఇప్పటికీ విడుదల కాని ప్రభుత్వ నోటిఫికేషన్
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

రాయవరం: విద్యా వ్యవస్థలో కూటమి ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోంది.. సరైన ప్రణాళిక లేకుండా సాగుతున్న వైనం విద్యార్థులను ఇబ్బంది పాల్జేస్తోంది.. దీనికి ఉదాహరణే డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ. ఈ కళాశాలల్లో చేరికలకు ఇప్పటి వరకూ అధికారికంగా ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం విద్యా వ్యవస్థను అయోమయంలో పడేస్తోంది. ఇంటర్ ఫలితాలు విడుదలై దాదాపు మూడు నెలలు దాటినా నేటికీ డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా జూలై మాసానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమై తరగతులు సైతం ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఇంత వరకూ ఆ ఊసే లేకుండా పోయింది. దీంతో వేలాది మంది విద్యార్థుల్లో గందరగోళం నెలకొంది. జిల్లాలో 2024-25 సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 12,825 మందికిగాను 9,246 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరితో పాటు పలువురు సప్లిమెంటరీ రాసి పాసైన వారున్నారు. వీరంతా డిగ్రీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు.

జిల్లాలో 53 కళాశాలలు

జిల్లాలోని మొత్తం 53 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతో పాటు ఎయిడెడ్ అన్ ఎయిడెడ్ విద్యా సంస్థలు డిగ్రీ కోర్సులను నిర్వహిస్తున్నాయి. ఆయా కళాశాలలు బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఎం, బీబీఏ వంటి కోర్సులను వివిధ కాంబినేషన్లతో డిగ్రీ విద్యను అందిస్తున్నాయి. గత విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో సుమారు 10 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నత విద్యపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది కూడా అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యంగా చేపట్టడంతో చాలా కళాశాలల్లో 30 శాతం సీట్లు మిగిలిపోయాయి.



వీడని సందిగ్ధత

డిగ్రీ కోర్సులకు సంబంధించి సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్టుపై సందిగ్ధత కొనసాగుతోంది. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్టుతో నూతన డిగ్రీ కోర్సులను అందిస్తున్నారు. అయితే వీటిపై వస్తున్న సందిగ్ధతతో విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాలల యాజమాన్యాలు గందరగోళానికి గురవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితిపై ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కూడా ఆందోళనలో ఉన్నారు.

తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఇంటర్ ఫలితాలు విడుదలై మాసాలు గడుస్తున్నా ప్రవేశాలు చేపట్టకపోవడంపై గందరగోళం నెలకొంది. డిగ్రీ కళాశాలలు పునః ప్రారంభమై నెలన్నర దాటింది. ఇంకా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కాకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. తక్షణమే డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలి.

– బి.సిద్ధూ, రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీడీఎస్‌యూ

ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి



డిగ్రీ అడ్మిషన్లపై నేటి వరకూ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణం. డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గతేడాది ఆలస్యంగా నోటిఫికేషన్ ఇచ్చారనుకుంటే, ఈ ఏడాది మరింత జాప్యం చేశారు. డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి. ఇతర రాష్ట్రాల్లో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. రాష్ట్రంలో ప్రవేశాలు చేపట్టకపోవడం సరికాదు.

– మిందిగుదిటి శిరీష్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం, అమలాపురం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

క్లుప్తంగా

గజాననా రక్షమాం..



కొబ్బరి పీచుతో మహిళలు తయారు చేసిన వినాయకుని బొమ్మ

మామిడికుదురు: వినాయక చవితి వచ్చేస్తోంది.. పర్యావరణ పరిరక్షణ హితం కోరుతూ పీచుతో వినాయకుడి బొమ్మలను పాశర్లపూడి బాడవకు చెందిన మహిళలు తయారు చేస్తున్నారు. ఈ బొమ్మలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఒకటిన్నర అడుగులు నుంచి రెండడుగుల సైజులో ఉన్న ఈ బొమ్మలు అబ్బుర పరుస్తున్నాయి. పీచుతో తయారైన ఈ బొమ్మల వల్ల పర్యావరణానికి ఎటువంటి హాని ఉండని ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్ తెలిపారు. పీచుతో తయారు చేస్తున్న ఈ బొమ్మలను ప్రతి ఒక్కరూ ఆదరించి మహిళలను ప్రోత్సహించాలని అన్నారు.

గురుదేవా.. అందుకో పురస్కారం

- ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఆహ్వానం
- ఈ నెల 8 వరకూ అవకాశం
- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

రాయవరం: బోధకులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు వీలుంది. సెల్ఫ్ నామినేషన్, రికమండెడ్ బై 5 ఫెలో టీచర్, పెర్ఫార్మెన్స్ బేస్డ్ అవార్డ్ త్రూ లీప్ యాప్ ఇలా మూడు కేటగిరీల్లో అవార్డులు అందజేయనున్నారు. వ్యక్తిగతంగా నామినేషన్ చేసుకునే వారితో పాటు, కొందరు ఉపాధ్యాయులు తమ పని తాము చేసుకుంటూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోరు. అటువంటి ఉత్తమ ఉపాధ్యాయులను ఐదుగురు ఉపాధ్యాయులు కలసి ఒకరిని ఎంపిక చేస్తారు. లీప్ యాప్ ద్వారా ఎంపిక చేసే ఉపాధ్యాయుల జాబితా రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరుకుంటుంది. జిల్లా నుంచి 16 మందిని ఎంపిక చేస్తారు. ఆ జాబితాలో ఉన్న ఉపాధ్యాయుల పనితీరును జిల్లా కమిటీ పరిశీలించి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సిఫార్సు చేయనుంది. జిల్లా స్థాయి అవార్డుల ఎంపికను డివిజన్, జిల్లా స్థాయి కమిటీలు చేయనున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు వివిధ కేటగిరీ పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, క్రాఫ్ట్/మ్యూజిక్/డ్రాయింగ్ టీచర్లు, డైట్‌లో పనిచేసే సీనియర్ లెక్చరర్స్, తెలుగు/హిందీ/సంస్కృత పండిట్లు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముంది. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు కనీసం పదేళ్ల సర్వీసు పూర్తయి ఉండాలి. అలాగే ఏ విధమైన క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసులు లేనివారు మాత్రమే అర్హులు.

వివిధ స్థాయిల్లో కమిటీలు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈఓ చైర్మన్‌గా, సభ్యులుగా స్థానిక హెచ్ఎం, డైట్ లెక్చరర్/మండలానికి చెందని మరో హెచ్ఎం సభ్యులుగా ఉంటారు. మండలంలోని ఎంఈఓ పరిధిలోని ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వారు పనితీరు ఆధారంగా మార్కులను కేటాయిస్తారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయుల జాబితాను ఎంఈఓలు జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తారు. అలాగే డివిజనల్ స్థాయిలో డీవైఈఓ చైర్మన్‌గా, మరో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ఎమినెంట్ ఎడ్యుకేషనలిస్ట్, జిల్లా కలెక్టర్‌చే ఎంపిక కాబడిన మరో జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు.

పారదర్శకంగా ఎంపిక



జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానించాం. వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం పూర్తి పారదర్శకంగా ఎంపిక చేస్తాం. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుదారుల్లో అన్ని విభాగాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తిస్తాం. దీనికి గాను అన్ని చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 8వ తేదీ వరకు డివిజనల్ స్థాయిలో దరఖాస్తులు స్వీకరిస్తారు.
- 11న వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేస్తారు. 12న డివిజనల్ స్థాయిలో స్క్రూటినీ చేసిన జాబితాను డీఈఓ కార్యాలయంలో అందజేస్తారు.
- 14న డివిజనల్ స్థాయి నుంచి వచ్చిన అన్ని కేటగిరీల దరఖాస్తులను స్క్రూటినీ చేసి 1:1 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు.
- 16న తుది జాబితాను జిల్లా విద్యాశాఖ నుంచి పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు.
- 21 నుంచి 23 వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- 25న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారి తుది జాబితాను రూపొందిస్తారు.
- సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేస్తారు. లీప్ యాప్ ఆధారంగా ఇచ్చే ఈ అవార్డులకు గాను ఈ నెల 4న జిల్లాల వారీగా జాబితాను ఎంపిక చేస్తారు. 8న జిల్లా స్థాయి కమిటీ ఎంపికైన వారి పనితీరును పరిశీలిస్తుంది. 14న జిల్లా స్థాయి కమిటీ పరిశీలన అనంతరం 1:1 నిష్పత్తిలో జాబితాను ఎంపిక చేసి, 16న రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తారు. వీరికి కూడా ఈ నెల 21 నుంచి 23 వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

దారికి రాని దోపిడీ కేసు

- వ్యాపారిని కొట్టి సొత్తు దోచుకున్న అగంతకులు
- పోలీసులకు సవాల్‌గా మారిన కేసు
- ఆధారాల కోసం ముమ్మర దర్యాప్తు



గొల్లప్రోలులో సీసీ కెమెరాల్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో కలకలం రేపిన దారి దోపిడీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. రాజమహేంద్రవరం నల్లమందు సందుకు చెందిన సమీర్ ప్రజాపత్ భవాని సిల్వర్ ప్యాలెస్ అనే వెండి బంగారు నగల వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. రోజూ ఇతర ప్రాంతాల్లో ఉన్న వెండి, బంగారు వ్యాపారుల నుంచి వచ్చిన ఆర్డర్ల ప్రకారం వస్తువులు తయారు చేసి తీసుకెళ్లి ఇవ్వడం, తిరిగి వారి నుంచి ఆర్డర్లు తీసుకుని వారు ఇచ్చే నగదుతో పాటు వెండి, బంగారాన్ని తీసుకు వెళుతుంటాడు. గత నెల 28న మధ్యాహ్నం 12 గంటలకు యథావిధిగా అతని యజమాని చెప్పిన ఆర్డర్ల ప్రకారం వెండి వస్తువులను తీసుకుని, వాటిని డెలివరీ కోసం రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలులో వస్తువులు ఇచ్చి సంబంధిత షాపుల నుంచి ముడి వెండిని, వెండి వస్తువులను, బంగారాన్ని తీసుకుని, గొల్లప్రోలులో పని ముగించుకుని చెందుర్తిలోని మరో బంగారు షాపు వద్దకు బయలు దేరాడు. మార్గ మధ్యంలో జాతీయ రహదారి 216 నుంచి చెందుర్తి గ్రామం వెళ్లే రోడ్డులో పామాయిల్ తోట వద్దకు వెళ్లేసరికి రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వచ్చి భవానిని అటకాయించి, అతని వద్ద ఉన్న 12.50 కిలోల వెండి, 51 గ్రాముల బంగారం, రూ.60 వేలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. దీంతో బాధితుడు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విషయం తెలపడంతో పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణలు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి ఐదు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు.

ముందుగా రెక్కీ చేసి..

ప్రతి నెలా ఏదొక సమయంలో భవాని ఇక్కడకు వస్తుంటాడన్న విషయం తెలుసుకున్న అగంతకులు అసలు బాధితుడు ఎప్పుడు వస్తున్నాడు.. ఎలా వెళుతున్నాడనే విషయాలపై రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసు బృందాలు వివిధ ప్రాంతాల్లో ఇటువంటి దోపిడీలకు పాల్పడే కేసుల్లో ఉన్న నిందితుల వివరాలు సేకరించి వారి ద్వారా కేసును ఛేదించే పనిలో ఉన్నట్లు సమాచారం. నిందితుల వివరాలు, వారు ఉపయోగించిన మోటారు సైకిళ్ల ఆనవాళ్లు, వారు ఎటు వెళ్లారనే విషయాలు గాని తెలిక పోలీసులు తలలు పట్టుకుంటున్నట్లు తెలిసింది.

కానరాని ఆచూకీ..

రెండు మోటారు సైకిళ్లపై నలుగురు వ్యక్తులు వచ్చి తనను అటకాయించి దాడి చేసి, తన వద్ద ఉన్న వెండి బంగారు వస్తువులతో పాటు నగదును లాక్కెళ్లినట్లు బాధితుడు చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో నలుగురు అగంతకులు చెందుర్తి రోడ్డుకు ఏపక్క నుంచి వచ్చారు.. ఏ మోటారు సైకిళ్లు ఉపయోగించారనే దానిపై పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అయితే సంఘటన జరిగిన సమయం రాత్రి కావడంతో సీసీ కెమెరాల్లో అటువంటి ఆనవాళ్లు ఉన్న వ్యక్తులు ఎవరూ కనిపించకపోవడంతో ఇతర ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. చెందుర్తి రోడ్డుకు గొల్లప్రోలు- కత్తిపూడి 216 జాతీయ రహదారి నుంచి దారి ఉండగా అటువైపు 16వ జాతీయ రహదారి ఉంది. అగంతకులు ఎటు నుంచి వచ్చారో తెలుసుకునే పనిలో పోలీసులు ఉన్నారు. అసలు వారు ఏ మోటారు సైకిళ్లు ఉపయోగించారనే విషయం బాధితుడు చెప్పలేక పోతుండగా సీసీ కెమెరాల్లో దొరకకపోవడంతో పోలీసులు ఆధారాల కోసం తలలు పట్టుకుంటున్నారు. అయితే ఈ రోడ్డుకు రావడానికి తాటిపర్తి వన్నెపూడి రోడ్డు నుంచి కూడా మరో మార్గం ఉండడంతో అగంతకులు ఎవరికీ అనుమానం రాకుండా, సీసీ కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు ఆ రోడ్డు ద్వారా వచ్చి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దోపిడీ రాత్రి సమయంలో జరగడంతో అగంతకుల పోలికలను కూడా బాధితుడు చెప్పలేకపోవడం కేసు దర్యాప్తునకు ఆటంకంగా మారిందంటున్నారు.

మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు దారుణం

పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను కలసిన సుభాష్ చంద్రబోస్



పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులతో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మురళీ కృష్ణంరాజు

రాజమహేంద్రవరం సిటీ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం దారుణమని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు ధ్వజమెత్తారు. ఆదివారం రాజమహేంద్రవరంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను వారు కలసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, అన్యాయంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్యన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాడుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు జరిపే వరకూ పోరాటం ఆగదన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. మిథున్‌రెడ్డి నిర్దోషిగా త్వరలోనే బయటకు వస్తారన్నారు. వీరి వెంట రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్, రాయవరం సత్తిబాబు ఉన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే రోజున విషాదం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- స్నేహితుడితో కలసి వెళుతుండగా ఘటన



తాతాజీవర్మ (ఫైల్)



తాతాజీవర్మ మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొనేందుకు మరో స్నేహితుడితో కలసి బైక్‌పై వెళుతున్న యువకుడు ప్రమాదవశాత్తూ దుర్మరణం పాలైన ఘటన ఆదివారం కోరంగిలో చోటు చేసుకుంది. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ కథనం ప్రకారం.. స్నేహితుల దినోత్సవం సందర్భంగా చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొప్పాడి తాతాజీవర్మ (19) అలియాస్ తాతీలు అతని స్నేహితుడు అరదాడి శ్రీనివాస్‌తో కలసి కాకినాడ వెళ్లేందుకు బైక్‌పై బయలు దేరారు. జాతీయ రహదారి 216లోని కోరంగి దుర్గామల్లేశ్వర ఆలయం సమీపంలో అకస్మాత్తుగా గేదె అడ్డురావడంతో బలంగా గేదెను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తాతాజీ వర్మ కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం అయ్యింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మరో యువకుడు శ్రీనివాస్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. తాతాజీవర్మ హైదరాబాద్‌లో ఉంటూ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడని, ఇంతలోనే ఇలా జరగడం బాధాకరమని గ్రామస్తులు అన్నారు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

నిడదవోలులో భారీ చోరీ



బీరువా లాకర్ తెరిచిన దృశ్యం

నిడదవోలు: స్థానిక సంజీవయ్యనగర్ బుక్కాపేటలో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని నలుబోను వెంకటేశ్వరరావు అనారోగ్యం కారణంగా గత నెల 15న మంగళగిరిలోని ఆసుపత్రిలో చేరారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి నిడదవోలుకు తిరుగుతున్నారు. ఇదిలా ఉంటే వెంకటేశ్వరరావు భార్యకు బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో ఇద్దరూ అక్కడే చికిత్స పొందుతున్నారు. కుమార్తె గౌతమి తల్లిదండ్రులను చూసుకుంటూ అక్కడే ఉండిపోయారు. మంగళగిరి నుంచి గౌతమి శనివారం రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు బద్దలకొట్టి తలుపులు తీసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. గదిలో బీరువా లాకర్‌ను గునపంతో పెకించారు. లాకర్‌లో ఉన్న 30 కాసుల బంగారం, 20 కాసుల వెండి, రూ.50 వేలను దొంగలు అపహరించుకుపోయారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీపీఎస్ క్రైం సీఐ శ్రీధర్‌కుమార్ సంఘటనా స్థలానికి వివరాలు సేకరించారు. గౌతమి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాడె, బీడు బెడ్ మాయం

కడియం: చోరీ చేసేవారికి ఏ వస్తువైనా ఒకటే అన్నట్టు ఉంది. శ్మశానంలోని పాడె, బీడు వస్తువులు సైతం మాయం చేసి అందరూ నివ్వెరబోయేలా చేశారు. ఆ వివరాల్లోకెళితే.. కడియపులంక శ్మశాన వాటికలో మృతదేహాన్ని తీసుకు వచ్చేందుకు స్టీలుతో తయారు చేయించిన పాడె, దహనం చేయడానికి వినియోగించే బీడు బెడ్‌లను దాతలు సమకూర్చారు. ఆదివారం అవి మాయమైనట్లు గ్రామస్తులు గుర్తించారు. అంత్యక్రియలకు వినియోగించే వాటిని దొంగలు మాయం చేసినట్టు తెలుసుకుని అంతా ముక్కున వేలేసుకున్నారు. ఇదిలా ఉండగా శ్మశాన వాటిక చుట్టుపక్కల చిట్టడవిని తలపించే విధంగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని గ్రామస్తులు తెలిపారు. దీంతో ఆ తుప్పల్లో గంజాయి అమ్మకాలు, మద్యం, పేకాట తదితర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారే వీటిని మాయం చేసి ఉంటారన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది.

కొత్త జీఓల వెనుక రాజకీయ కుట్ర



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర నేత కడితి సతీష్

జగ్గంపేట: పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరిని అనుమతించరాదని, పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆదివారం జగ్గంపేటలో పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులతో పాఠశాలల్లో విద్యార్థులు తమ స్వేచ్ఛను కోల్పోతారన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు బయటకు రాకుండా చేయడానికి పన్నిన కుట్ర ఈ కొత్త జీఓ అని అన్నారు. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని అన్నారు. పాఠశాలలను రాజకీయాలకు తావులేకుండా చూడాలని విద్యాశాఖ మంత్రి చెబుతున్నారని, అయితే తల్లికి వందనం పథకం సందర్భంగా రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో రాజకీయ నాయకులు పబ్లిసిటీ చేశారన్నారు. అలాగే వైజాగ్‌లో జరిగిన జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులను బస్సులలో తీసుకెళ్లి కనీస వసతులు కల్పించలేదని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించినప్పుడు ఈఓలు గురించి ఆలోచన రాలేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చిన తరువాత మరోలా కక్షపూరిత రాజకీయాలు చేయడం సరికాదన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చినప్పుడు, పరిష్కరించక పోగా విద్యార్థి సంఘాలను కట్టడి చేసే జీఓలు తీసుకురావడం సరికాదని అన్నారు. ఈ జీఓలను తక్షణం రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

హోరాహోరీగా జాతీయ స్థాయి హాకీ పోటీలు



హాకీలో తలపడుతున్న అసోం, ఉత్తరాఖండ్ జట్ల క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జాతీయ స్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. తొలుత ఈ మ్యాచ్‌లను ముఖ్య అతిథులు డైరెక్టర్ ఆఫ్ మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ జి.సతీష్ బాబు, విశాఖ పోర్టు ఫైనాన్స్ హెడ్ డి.రమణమూర్తి ప్రారంభించారు. మూడో రోజు మొదటి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్, అసోం జట్లు పోటీ పడగా 2-2తో మ్యాచ్ డ్రా అయ్యింది. రెండో మ్యాచ్‌లో బీహార్, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్ కూడా డ్రాగా నిర్వాహకులు ప్రకటించారు. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను టోర్నీ కోఆర్డినేటర్ వి.రవిరాజు పర్యవేక్షించారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



సాకేత్

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకకు చెందిన సుంకర సాకేత్ అండర్- 14 షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ కోచ్ నాగులుకొండ వీరభద్రరావు తెలిపారు. ఇటీవల సికింద్రాబాద్‌లో ఐసీఎస్‌సీ స్కూల్ గేమ్స్ అండర్- 14లో సాకేత్ ఆంధ్ర, తెలంగాణ రీజనల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రెండో స్థానంలో నిలిచారన్నారు. సెప్టెంబర్ 24, 25 తేదీల్లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వీరభద్రం తెలిపారు. సాకేత్‌ను, అతని తండ్రి బ్యాడ్మింటన్ ప్లేయర్ సుంకర గంగరాజును పలువురు అభినందించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



గుత్తుల బాలకృష్ణ (ఫైల్)

కపిలేశ్వరపురం (మండపేట): కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామం గుడ్డిగూడేనికి చెందిన గుత్తుల బాలకృష్ణ (26) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం 8 గంటల సమయంలో ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ద్వారపూడి జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ వై.నాగేశ్వరరావు తెలిపారు. అవివాహితుడైన బాలకృష్ణ మండపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు హెచ్‌సీ నాగేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం



కళా సత్యనారాయణ (ఫైల్)

కాజులూరు: తణుకువాడకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసుల కథనం ప్రకారం.. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న కళా సత్యనారాయణ (63) వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు నాలుగు రోజుల కిందట స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం గొల్లపాలెంలో బంధువులను కలుసుకునేందుకు వెళ్తుండగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి వద్ద కాకినాడ, కోటిపల్లి రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తూ వేగంగా ఢీకొని వెళ్లిపోయాడు. ఈ సంఘటనలో సత్యనారాయణ తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా ఎస్సై మోహన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

పోలవరం కాలువలో పడి మహిళ ఆత్మహత్య

జగ్గంపేట: మండలంలో రామవరం వద్ద పురుషోత్తపట్నం ఫేజ్- 2 పోలవరం కాలువలో పడి ఓ మహిళ మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దాపురం గ్రామానికి చెందిన వివాహిత జి.వరలక్ష్మి (48) కుటుంబ సభ్యులతో సమస్యల కారణంగా క్షణికావేశంలో పోలవరం కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వరలక్ష్మి శనివారం ఉదయం పోలవరం కాలువలో దూకి ఉండవచ్చని, ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి స్థానికులు సమాచారం అందించారని ఎస్సై చెప్పారు. మృతురాలి భర్త సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

నల్లజర్ల: గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కండెపు సోమమ్మ (100) ఆదివారం మృతి చెందింది. ముందురోజు వరకూ ఆమె పనులు ఆమే చేసుకునేదని సోమమ్మ కుమారుడు వెంకటరత్నం చెప్పారు. పలువురు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.